వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 42
శుక్రవారం | 04 ఆగస్టు 2023 | పేజీలు : 08 | వెల రూ. 5



2లో..

# అమ్మవారి నగదు, బంగారం అపహరణ

ఒకే రోజు
రెండు రేణుక ఎల్లమ్మ దేవాలయాల్లో చోరీ




ఆక్రమణకు గురవుతున్న భద్రకాళి చెరువు

నగరానికి పొంచి ఉన్న ప్రమాదం

అయినా స్పందించని బల్దియా

# చెదిరిన హద్దులు
# చెరబట్టిన రియల్టర్లు

2లో



వరంగల్ నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి చెరువు ఆక్రమణకు గురవుతోంది. 2013లో సుప్రీం కోర్టు ఉత్తర్వుల మేరకు భద్రకాళి చెరువు చుట్టూ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను వరంగల్ నగర పాలక సంస్థ ఖరారు చేసింది. ఈ మేరకు చెరువు కట్ట చుట్టూ పెద్ద పెద్ద సిమెంట్ దిమ్మలను నిర్మించారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవంటూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. నేడు ఈ హద్దులు చెదిరిపోయాయి. కొంతమంది రియల్టర్లు రాజకీయ నాయకుల అండతో వాటిని తొలగించి ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పెద్ద పెద్ద భవంతులు నిర్మించారు. ఇప్పటికీ భవన నిర్మాణాలు అప్రతిహతంగా కొనసాగుతున్నా బల్దియా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అయితే రియల్టర్లనుంచి బల్దియా పాలకులకు పెద్ద మొత్తంలో ముడుపులు వస్తున్నందునే అటువైపు కన్నెత్తి చూడడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. - వరంగల్ వాయిస్ ప్రతినిధి

## ఫైర్ సిబ్బంది.. బోట్ ట్రైనింగ్


2లో

వరంగల్, హనుమకొండ ఫైర్ స్టేషన్ లకు కొత్తగా రెండు పడవలు రావడంతో వాటిని నడిపించేందుకు ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రతి శుక్రవారం రెండు జిల్లాల పరిధిలోని ఏదో ఒక చెరువులో తర్ఫీదు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వరదల సమయంలో ప్రజలను రక్షించేందుకు ఇది ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సహాయక అగ్నిమాపక అధికారి కె.జయపాల్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ ఫైర్ ఆఫీసర్లు ఎ.నాగరాజు, ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

-వరంగల్ వాయిస్, వరంగల్


8లో

## జీపీ కార్మికుల సమ్మెకు నెల రోజులు

‘ప్రగతి’ కారకులం.. ‘పస్తు’లుంటున్నాం..!

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

కార్మికులకు ఆరోగ్య, ఆర్థిక భద్రత కల్పించండి..

## న్యాయం కోరితే నిర్బంధమా..?

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామా రాజేష్ ఖన్నా


2లో..

# చెదిరిన హద్దులు.. చెరబట్టిన రియల్టర్లు



**ఆక్రమణకు గురవుతున్న భద్రకాళి చెరువు**
**నగరానికి పొంచి ఉన్న ప్రమాదం**
**అయినా స్పందించని బల్దియా**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** కాకతీయ రాజులు గొలుసు కట్టు చెరువుల్లో భాగంగా నిర్మించిన నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి చెరువు ఆక్రమణకు గురవుతోంది. వరంగల్ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు అప్పటి కాకతీయ రాజు గణపతి దేవుడు దీనిని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. వరంగల్-హనుమకొండ నగరాల వారధిగా హనుమకొండ మండలం సర్వే నెంబరు 849/ బీ1లో 386.33 ఎకరాల్లో భద్రకాళి చెరువు ఉంది. పూర్వం దీని కింద సాగు ఉండేది. నగర విస్తరణతో చెరువు శిఖం భూములు కాలనీలయ్యాయి. ఈ చెరువును 1985 నుంచి గ్రేటర్ వరంగల్ వేసవి జలాశయంగా వినియోగించుకుంటుంది. ఇంతటి ప్రాశస్థం కలిగిన ఈ చెరువును రెవెన్యూ శాఖ, వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చెరువు విస్తీర్ణం రోజు రోజుకూ కుచించుకుపోతోంది. చెరువుకట్టను ఆనుకొని ఉన్న శిఖం భూములు పెద్ద ఎత్తున అన్యాక్రాంతం అవుతున్నాయి. పద్మాక్షి దేవాలయం నుంచి హంటర్ రోడ్డును కలిపే రోడ్డువైపు ఉన్న చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో అపార్ట్ మెంట్లు వెలుస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు చెప్పలేనన్ని నిర్మాణాలు జరుగుతున్నా బల్దియా పాలకులు నోరు విప్పడంలేదు. ఆ ప్రాంతమంతా కాంక్రీట్ జంగిల్ గా మార్చేందుకు బల్దియా అధికారులే అనుమతులిస్తూ తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. హంటర్ రోడ్డును ఆనుకొని ఉన్న కట్ట దిగువ ప్రాంతం కాలనీలుగా మారుతోంది. అయితే ఈ తతంగంలో బల్దియా అధికారులకు, పాలకవర్గానికి పెద్ద మొత్తంలోనే ముడుపులు అందుతున్నట్లు ప్రచారం సాగుతోంది.




### దిమ్మెలు తొలగించారు..

భద్రకాళి చెరువు ఆక్రమణలను అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో పదేళ్ళ క్రితమే 2013లో భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలమేరకు చెరువు చుట్టూ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)ను వరంగల్ నగర పాలక సంస్థ ఖరారు చేసింది. భవన నిర్మాణ అనుమతి 2012 రూల్ 3(ఏ) (2) ప్రకారం ఎఫ్‌టీఎల్ హద్దు నుంచి 30 మీటర్ల వరకు (100 అడుగులు) వరకు భవన నిర్మాణాలు చేయొద్దన్న నిబంధన విధించింది. ఈ మేరకు హనుమకొండ, పద్మాక్షి రోడ్డు, గాయత్రీ కాలనీ, సాయినగర్, సంతోషిమాత కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, రామన్నపేట రోడ్డు, పోతన నగర్, కేఎంసీ పార్కుల వద్ద క్షేత్ర స్థాయిలో ఎఫ్‌టీఎల్‌ను మార్కింగ్ చేస్తూ దిమ్మెలను ఏర్పాటు చేశారు. వాటిని తొలగించేందుకు వీలు లేకుండా పెద్ద సైజులో కాంక్రీట్ తో నిర్మించారు. వాటిపై వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (డబ్ల్యూఎంసీ) పేరు కనిపించేలా రాయించారు. దీనికితోడు ఇలాంటి స్థలాల అమ్మకం, కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. నేడు ఈ దిమ్మెలు మచ్చుకు కూడా కనిపించకుండా చేశారు. అక్రమణదారులు దిమ్మెలను ధ్వంసం చేసి వాటి నామరూపాలు లేకుండా చేశారు.

### కట్టకు సమీపంలోనే నిర్మాణాలు..

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ తరహాలోనే భద్రకాళి బండ్ నగరవాసలకు దర్శనీయ స్థలంగా మారింది. దీంతో చెరువు కట్ట కింద ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూములకు డిమాండ్ పెరిగి ఆక్రమణలకు గురవుతున్నాయి. బండ్ కు కేవలం ముప్పై ఫీట్ల దూరంలోనే ప్రైవేట్ వ్యక్తుల నిర్మాణాలు వెలిశాయి. కొన్ని ప్రాంతాల్లో బండ్ కు కేవలం పది ఫీట్ల దూరంకూడా లేకుండా నిర్మింణాలు చేపట్టారు. దీంతో భద్రకాళి బండ్ కు ప్రైవేట్ గృహాలకు మధ్య చిన్నపాటు మురుగు కాలువలు మాత్రమే దర్శనమిస్తున్నాయి.

### పాలకుల మాటలు నీటి మూటలు..

సుప్రసిద్ధమైన భద్రకాళి చెరువును రక్షించాల్సిన బాధ్యత జీడబ్ల్యూఎంసీపై ఉందని అప్పటి మేయర్ నన్నపునేని నరేందర్, అప్పటి కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ కౌన్సిల్ సమావేశం సాక్షిగా అధికారికంగా ప్రకటించారు. రిజిస్ట్రేషన్లు జరగకుండా జిల్లా రిజిస్ట్రార్ అధికారులకు లేఖ రాస్తామన్నారు. కానీ తర్వాత ఏమైదోఏమో కాని వారి హామీ అమలుకు నోచుకోలేదు. ఆ దిశగా కనీసం చర్యలు కూడా తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో భద్రకాళి చెరువు శిఖం భూమిలో ఆక్రమణలు విచ్చల విడిగా సాగుతున్నాయి.

### అనుమతులు లేకుండానే..

నగర పాలక సంస్థ అనుమతుల్లేకుండానే ఆక్రమిత స్థలాల్లో రాత్రికి రాత్రే ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్నాయి. గత అయిదేళ్లలో చెరువు భూమిని మింగేస్తూ పలు కాలనీలు వెలిశాయి. భద్రకాళి చెరువు బండ్ నిర్మాణం అయిన తర్వాత ఈ ఆక్రమణలు మరింత జోరందుకున్నాయి. బండ్ సుందరీకరణ పనులు మొదలైన తర్వాత కబ్జాదారులకు మార్గం మరింత సులభమైంది. చెరువు భూమి విలువ పెరుగుతున్నా కొద్దీ ఆక్రమణలు అంతకంతకు జోరందుకుంటున్నాయి. కొదరు బడాబాబులు తమ పలుకుబడిని అడ్డంపెట్టుకొని తప్పుడు పత్రాలు సృష్టించి విచ్చల విడిగా ఆక్రమించుకోగా, మరికొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలకు తెరతీశారు. అంగబలం, అర్థబలం ఉన్న మరికొందరు బల్దియా ఉద్యోగులకు మచ్చిక చేసుకొని నిర్మాణాలను పూర్తి చేసుకోవడంతోపాటు ఇంటి నెంబర్లను కూడా తీసుకున్నారు. దీంతో ఎన్‌టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీ, సాయినగర్, గాయత్రీ నగర్ కాలనీ, సిటిజన్ క్లబ్ వెనుక ద్వారకానగర్, పద్మాక్షి గుట్ట రోడ్డు ప్రాంతాల్లో కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా మరికొందరు బహుళ అంతస్తుల భవనాలనే నిర్మించారు. ఇందుకు నగర పాలక సంస్థ అధికారులు సహకరిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# విధుల్లో చేరిన తహసీల్దార్లు

**వరంగల్ జిల్లాలో 11.. హనుమకొండలో 12మంది**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో 23మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్లు పి.ప్రావీణ్య, సిక్తా పట్నాయక్ లు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు విధుల్లో జాయిన్ అయ్యారు. వరంగల్ జిల్లా పరిధిలోని వరంగల్ మండల తహసీల్దార్ గా మొహమ్మద్ ఇక్బాల్, ఖిలావరంగల్ మండల తహసీల్దార్ గా బి.నాగేశ్వర్ రావు, వర్ధన్నపేటకు ఫణి కుమార్, గీసుగొండకు ఎండి రియాజుద్దీన్, పర్వతగిరికి విజయ్ సాగర్, రాయపర్తికి ఎమ్ శ్రీనివాస్, దుగ్గొండికి రవిచంద్రరెడ్డి, నర్సంపేటకు విశ్వ ప్రసాద్, ఖానాపూర్ కిరణ్ కుమార్, నల్లబెల్లి మండల తహసీల్దార్ గా బి.రాజేశ్, సంగెం మండల తహశీల్దార్ గా రాజ్ కుమార్ లను నియమిస్తూ వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం తమకు కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టారు.

### హనుమకొండలో..

హనుమకొండ జిల్లా పరిధిలోని 12మండలాలకు కొత్త తహసీల్దార్ లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉత్తర్వులు విడుల చేశారు. కాజీపేట తహసీల్దార్ గా ఐ.భావ్ సింగ్, ధర్మసాగర్ కు జి.సదానందం, హసన్ పర్తికి చిల్లా ప్రసాద్, హనుమకొండకు కె.విజయ్ కుమార్, వేలేర్ కు హెచ్.కొమ్మి, నడికుడకు జి.నాగరాజు, శాయంపేటకు డి.ఎస్.వెంకన్న, ఐనవోలుకు జె.సుభాషిని, ఎక్కతుర్తికి ఎ.జగత్ సింగ్, కమలాపూర్ కు పి.మాధవి, దామెరకు జ్యోతి వరలక్ష్మి దేవి, భీమదేవరపల్లికి ఎ.వెంకన్న భాస్కర్ లను నియమిస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వెంటనే తమకు కేటాయించిన ప్రాంతాల్లో తమసీల్దార్లు బాధ్యతలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

# న్యాయం కోరితే నిర్భందమా..?

**ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి**
**రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామా రాజేష్ ఖన్నా**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడిన మాపైనే నిర్భందమా అంటూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ప్రభుత్వంపై ఎదురు దాడి చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను ఎక్కడి కక్కడ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడంపై వారు మండి పడ్డారు. ఈ మేరకు పలువురిని వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ తరలించడంపై నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 23 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ బేసిస్ లో పనిచేస్తున్న ఎన్ హెచ్ ఎం అల్ క్యాడర్ ఉద్యోగులను ఎటువంటి పరీక్షలు లేకుండా రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయరాదని ఆయన ప్రభుత్వానికి, పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అరెస్టయిన వారిలో ఎన్ హెచ్ ఎం స్కీం స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్ట్ లు, టీబీ సూపర్ వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఓటీ టెక్నీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, ఎంఎన్ ఓలు, వాచ్ మెన్లు, స్వీపర్లు, ల్యాబ్ అటెండర్లు, డ్రైవర్లు ఉన్నారన్నారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో అరెస్టు అయిన వారిలో ఎన్ హెచ్ ఎం ఎంప్లాయిస్ ఉర్ రెహమాన్, ముజాహిద్ అలీ, అరుణోదయ, తిరనాహరి వెంకట శ్రీనివాస్, స్రవంతి తదితరులు ఉన్నారు.

# అమ్మవారి నగదు, బంగారం అపహరణ

**ఒకే రోజు రెండు రేణుక ఎల్లమ్మ దేవాలయాల్లో చోరీ**




**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంతోపాటు దేవన్నపేట గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయాల్లో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. స్థానికులు, ఆలయ కమిటీ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై హసన్ పర్తి వద్ద రేణుక ఎల్లమ్మ గుడి ఉంటుంది. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రేణుక ఎల్లమ్మ గుడి తలుపులు పగులగొట్టి అమ్మవారి బంగారం ముక్కుపుడక, పుస్తెలతాడు, వెండి కండ్లతోపాటు హుండీలను పగులగొట్టి రూ.40 వేల నగదును తస్కరించారు. హుండీలను గుడి వెనక వదిలి వెళ్లారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా దేవన్నపేట గ్రామంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళాలు పగులగొట్టి నగదు, బంగారం తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న హసన్ పర్తి సీఐ తుమ్మ గోపి, ఎస్సై అశోక్ ఇతర పోలీసులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం సహాయంతో విచారణ చేపట్టారు.

# ఘనంగా డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక జేఎన్ఎస్ స్టేడియంలో శుక్రవారం ప్రముఖ హెూమియో ఫిజీషియన్ డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ జన్మదిన వేడుకలు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నారని, ఇలాగే వైద్య రంగంలో మరిన్ని విశిష్ఠ సేవలను ప్రజలకు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ డాక్టర్ శ్రీధర్ మొదటి నుంచి కష్టపడి ఉన్నత స్థితికి ఎదిగాడని, ఇలాగే వైద్య వృత్తిలో మంచి సేవలందించి సమాజానికి మేలు చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావుశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించినందుకు ఆత్మీయ మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, రాజు ప్రసాద్, అరుణ్ కుమార్, సంతోష్, మనోజ్ కుమార్, సురభి కిరణ్, కోమాకుల మధు, కోచ్ రమేష్, రాజు, కృష్ణ, రాజిరెడ్డి, శశి, మహేందర్ రెడ్డి, పూజారి విజయ్, రాజు, సంపత్, వేణు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని కొండంపేట-1, కేశారంపల్లె అంగన్వాడీ సెంటర్లలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వల్లెంకుంట ఎంపీటీసీ ఏనుగు నాగరాణి లక్ష్మి నారాయణ, కొండంపేట సర్పంచ్ స్వామి హాజరై మాట్లాడుతూ శిశువుకు తల్లి పాలే శ్రీరామ రక్ష అని, పోషక పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. అనంతరం కిశోర బాలికలకు కిషోరామృతం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కల్యాణి, సరిత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, పరకాల :** హనుమకొండ జిల్లా పరకాల మండలంలోని మల్లక్కపేట గ్రామంలో రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చిత్రపటానికి గ్రామ రైతులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా రైతులకు ఎన్నో విధాలుగా ఆదుకుంటూ దేశంలోనే తెలంగాణ రైతులను అత్యున్నత స్థాయిలో నింపిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు, కేసీఆర్ కు చల్లా ధర్మారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, రైతులు, బీఆర్ఎస్ నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ నవ నిర్మాణంలో పాలు పంచుకోండి



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలో పరకాల నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు గుండాల క్రాంతి అధ్యక్షతన టీపీసీసీ సభ్యుడు, పరకాల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదేశాల మేరకు నడికూడ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పం కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి యూత్ కాంగ్రెస్ డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రమాణాలు, వైఫల్యాలు, తెలంగాణ బీజేపీ చేసిన మోసాలు పబ్లిక్ ఛార్జిషిట్ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం కంఠాత్మకూర్, ధర్మారం గ్రామంలో ఇంటింటికి తిరిగి మోసపూరిత కేసీఆర్ సర్కార్ అమలుకు నోచుకోని బీఆర్ఎస్ ఎన్నికల హామీలు దగా తీరుపై కాంగ్రెస్ ఛార్జిషిట్ పత్రాలను ఇంటింటికి పంచారు. ఈ సందర్భంగా నడికూడ మండల ప్రధానకార్యదర్శి డా.మలహాల్ రావు మాట్లాడుతూ బీఆర్ ఎస్ గతంలో ఇచ్చిన హామీలు కేజీ టూ పీజీ ఉచిత విద్య హామీ రూ.3016 నిరుద్యోగ భృతి హామీ పేదలకు డబల్ బెడ్ రూం ఇల్లు హామీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లకు 12శాతం రిజర్వేషన్ హామీ పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ హామీ ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమి హామీ పోడు భూములు పంపిణీ చేశారు. ఇలా చాలా హామీలు ఇచ్చి ప్రజలకు మోసం చేస్తూ కాలం గడుపుతున్న కేసీఆర్ కు రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. కేంద్రంలో ఉన్న మోడీ ఐటీఐఆర్ ప్రాజెక్టు, వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపన ప్రతి సంవత్సరం రూ.2కోట్ల ఉద్యోగాల కల్పన నిజామాబాద్ లో పసుపు బోర్డు ఏర్పాటు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హెూదా ఇస్తామని హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టి ఇంత వరకు బీజేపీ నాయకులు ఈ హామీలపై నోరు విప్పకపోవడం విడ్డూరమని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ కేంద్ర, రాష్ట ప్రభుత్వాలను బొంద పెట్టి కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న యూత్ కాంగ్రెస్ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్ లాంటి ముఖ్యమైన పథకాలు ఇప్పటికే ప్రజలోకి లోతుగా వెళ్లిందని, ప్రజలకు మరింత చేరువ చేసి పరకాల నియోజకవర్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కంఠాత్మకూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బైరపాక భద్రయ్య, ధర్మారం గ్రామ కమిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పల్లె రామకృష్ణ, రాయిడి జీవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

## జోన్ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** సమాజంలో అవసరార్థులకు, నిరుపేదలకు లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని జోన్ చైర్ పర్సన్ డాక్టర్స్ నాగవాణి తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు వజినపల్లి శైలజ ఆధ్వర్యంలో ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ఊరటం గ్రామంలో వరద బాధితుల సహాయార్థంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఈ క్లబ్ ద్వారా చేపట్టే కార్యక్రమాలు మహిళల్లో ఉన్న సేవా గుణాన్ని చాటి చెప్పేలా ఉన్నాయని, ఎంతో మందికి ప్రయోజనం చేకూరేలా చేపడుతున్న సేవా కార్యక్రమాలు మనసుకు చాలా తృప్తి కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో వరద బాధితుల సహాయార్థంగా ఐదు క్వింటాళ్ల బియ్యం, 60కేజీల పప్పు, ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు, ఆయిల్ ప్యాకెట్స్, పసుపు కారం, సాల్ట్ ప్యాకెట్స్, పేస్టులు, 100 సబ్బులు, చీరలు, దుప్పట్లు, టవల్స్, ప్యాంటు షర్ట్స్, పిల్లల డ్రస్సులు మొదలైనవి అందించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి తొర్రూరులోని దాతలు బోనగిరి శంకర్, అన్వర్, వనమాల నాగేశ్వరరావు, గోపారపు నాగేశ్వరరావు, దారం కృష్ణ, సాయి నాల్ల వెంకన్న, వజినపల్లి శ్రీనివాస్, ఉప్పల నాగేశ్వరరావు, సేవా తరుణి సభ్యులు వారి వంతుగా సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో జడ్ సి డాక్టర్ ఎస్ నాగమణి, సెక్రటరీ శ్రీదేవి రెడ్డి, ట్రెజరర్ రజనీ , క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.శ్రీదేవి, లయన్ వజినపల్లి శ్రీనివాస్, వసుధా, గ్రామ సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే అభివృద్ధి సాధ్యం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ, రీవాక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సివిల్ సప్లయ్ డిపార్ట్ మెంట్ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్, మాజీ సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా రాంపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పిల్లలకు లాంగ్ నోట్ బుక్స్, స్టేషనరీ ఉచితంగా డాక్టర్ అనితా రెడ్డి, రీవాక్ సంస్థ సభ్యులు పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పేదరికం పిల్లల చదువుకు ఆటంకం కారాదని, వీరికి ఏ ఇబ్బంది కలుగకుండా పుస్తకాలు ఏర్పాటు చేసామని, పిల్లలు వినియోగించుకోవాలని, చక్కగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు. ఒక లక్ష్యం పెట్టుకొని కష్టపడి చదువుకోవాలని, చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. మధ్యాహ్న భోజనం బాగుంటుందా, కూరలు బాగుంటున్నాయా, సన్న బియ్యంతో వండుతున్నారా, వంటశాల శుభ్రంగా ఉందా, లేదా అని పరిశీలించి, పిల్లలను అడిగి అనితా రెడ్డి తెలుసుకున్నారు. రీవాక్ చైర్మన్ మోహన మురళి మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, చదువుతో పాటు మంచి నడవడికతో ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అనితా రెడ్డితో పాటు రీవాక్ సంస్థ సభ్యులు మోహన మురళీ, సిద్ధార్థ రెడ్డి, శ్యాంసుందర్, స్కూల్ హెచ్ఎం సమ్మయ్య, టీచర్స్ రవీందర్ రెడ్డి, లక్ష్మీ, స్వర్ణలత, అరుణ, సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

# ఏఎన్ఎంల అక్రమ అరెస్టును ఖండిస్తున్నా

## డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కాజీపేటకు చెందిన ఏఎన్ఎంలను శుక్రవారం అక్రమంగా అరెస్టు చేసి కాజీపేట పోలీస్ స్టేషన్ కు తరలించారు. దీంతో వరంగల్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి పోలీస్ స్టేషన్ కు వెళ్లి వారి అరెస్ట్ కు గల కారణాలను అడిగి తెలుసుకొని అక్రమ అరెస్టును ఖండించారు. అదేవిధంగా పోలీసు వారితో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఎవరికైనా వారి హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపే అధికారం ఉన్నదని దానిని కాదనడానికి ఎవరికి అర్హత లేదన్నారు. ముఖ్యంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ రాచరిక పాలన సాగిస్తుందని మండిపడ్డారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తులను, కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులర్ చేస్తామని చెప్పిన ఈ దగాకోరు బీఆర్ఎస్ ప్రభుత్వం మిగులు తెలంగాణను అప్పుల తెలంగాణ చేసి ప్రతి సామాన్యుడి నెత్తిమీద పది లక్షల అప్పు మోపిందని విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు వారి సమస్యలపై శాంతియుత ధర్నా చేపట్టి వారిని రెగ్యులర్ చేసి జీతాలు పెంచాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో వారిని అక్రమంగా పొద్దున మూడు గంటలకే పోలీస్ స్టేషన్ తరలించడం అమానవీయమని, అప్రజాస్వామ్యం అని మండిపడ్డారు. వెంటనే వారిని విడిచిపెట్టాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మీరందరూ అధైర్యపడవద్దని, అందరికీ న్యాయం చేస్తామని, బడుగులకు బలహీనులకు అందరికీ న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ అని, ఏఎన్ఎంలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలి, కాంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చంద్రయ్య, రావుల విద్యాసాగర్, మధ్యల శోభారాణి, పెద్దపెల్లి విజయ్, ఆనంద్ రెడ్డి, యాసీన్, మహేష్, అరవింద్, టోనీ, రేవంత్, అశోక్, శీను, హరి, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

# కరోనాలో కష్టపడి పనిచేస్తే.. అరెస్టులే మాకు బహుమానమా?

## అరెస్టైన సెకండ్ ఏఎన్ఎంల ఆవేదన

**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలు నిలపడానికి, తమ ప్రాణాలను ఎదురొడ్డి కష్టపడిన తమకు తెలంగాణ ప్రభుత్వం అరెస్టులను బహుమానంగా ఇచ్చిందని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని సెకండ్ ఏఎన్ఎంలు శ్రీలత, షబానా బేగంలు ఆవేదన వ్యక్తం చేశారు. సెకండ్ ఏఎన్ఎంల న్యాయపరమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు పోలీసులు సెకండ్ ఏఎన్ఎంలను మొగుళ్లపల్లి ఎస్ఐ జాఢీ శ్రీధర్ నేతృత్వంలో అరెస్టు చేశారు.కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలను నిలపటానికి తమ ప్రాణాలను ఎదురొడ్డి కష్టపడి పని చేసినందుకు తెలంగాణ ప్రభుత్వం తమకు అరెస్టులను బహుమతిగా ఇవ్వడం బాధాకరమైన విషయమన్నారు. సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసేంతవరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని, అధికారులు పోలీసులు బెదిరించిన భయపడే ప్రసక్తే లేదన్నారు. అదేవిధంగా అరెస్టయినా





ఏఎన్ఎంలను బేషరతుగా విడుదల చేయాలని వారిపై ఎటువంటి కేసులు నమోదు చేయవద్దని శ్రీలత, షబానా బేగంలు ప్రభుత్వానికి, పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

### ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి..

**వరంగల్ వాయిస్, పరకాల :** రెండో ఏఎన్ఎంలు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా శుక్రవారం పరకాల మండల పరిధిలో పనిచేస్తున్న డాక్టర్లను ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులను, ఏఎన్ఎంలను ,డాటా ఎంట్రీ ఆపరేటర్లను, డ్రైవర్లను, మిగతా ఎన్ హెచ్ఎం సిబ్బందిని ముందస్తుగా పరకాల పోలీస్ స్టేషన్ లో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎగ్జామ్ లేకుండా కాంట్రాక్ట్ వ్యవస్థలో పనిచేస్తున్న ఎన్ హెచ్ఎం సిబ్బందిని అందరిని రెగ్యులర్ చేయాలని, బేషరతుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వ్యవస్థ లేకుండా ఎన్ హెచ్ఎంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలతో పాటు మిగతా అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కె.చంద్రమౌళి, ఎం.ప్రశాంత్, పి.సుమలత, స్టాఫ్ నర్సులు ఎస్.రజిత, ఎస్.ప్రమీల, ల్యాబ్ అటెండెన్స్ రమేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ సీహెచ్ రోజా, డ్రైవర్ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# రైతు రుణమాఫీ అంతా బూటకం

## బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** రైతులకు రుణమాఫీ చేస్తున్నామంటూ సీఎం కేసీఆర్, వారి సహచర మంత్రులు చెప్పిన విధి విధానాలు రైతులకు అర్థమయ్యే విధంగా ఎందుకు చెప్పలేదని బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి అన్నారు. 2018లో లక్ష రూపాయలు అప్పు తీసుకున్న రైతు ఇప్పటికీ బ్యాంకులకు ఎంత మిత్తి చెల్లించుకొంటూ వచ్చారనేది, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియదా, ఒకసారి అప్పును రెన్యువల్ చేసుకున్న తర్వాత వీరి నిబంధనలో ఆ అప్పు ఉండదని, రైతులకు తెలియజేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం గానీ, సీఎం కేసీఆర్ గానీ, మంత్రులు, ఎమ్మెల్యేలు గానీ, రైతులకు వివరించే విధంగా చెప్పారా అన్ని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాల నుంచి రైతులు చెల్లించిన మిత్తి డబ్బులు రైతుల ఖాతాల్లో బ్యాంకులు లేదా, రాష్ట్ర ప్రభుత్వం జమ చేస్తుందో లేదో తెలియజేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని 2018 ముందు రైతులు ఎంతమంది ఎంత అప్పు తీసుకున్నారో తెలిపి, వారందరికీ రుణమాఫీ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

# బొగ్గుల వాగు ప్రాజెక్ట్ నీటి విడుదల



**వరంగల్ వాయిస్, మల్హర్ :** గత కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఎడ్లపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో గల మధ్య తరహా బొగ్గుల వాగు ప్రాజెక్ట్ జల కళను సంతరించుకుంది. దీంతో శుక్రవారం ప్రాజెక్ట్ నీటిని ఆయకట్టు రైతుల కోసం అధికారులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్లపల్లి సర్పంచ్ జనగామ స్వరూప బాపు, ఎంపీపీ చింతలపల్లి మల్హల్ రావు, వైస్ ఎంపీపీ బడితెల స్వరూప రాజయ్య, కో ఆప్షన్ మెంబర్ శివ సారయ్య, సింగిల్ విండో డైరెక్టర్ సంగెం రమేష్, మత్స్య శాఖ డైరెక్టర్ జంగిడి శ్రీను, వార్డు మెంబర్ మెరుగు శ్రీను, రుద్రారం, ఎడ్లపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఎలుగూర్ రంగంపేట మత్తడి బ్రిడ్జి గుంతల పరిశీలన



**వరంగల్ వాయిస్, పరకాల :** ఎలుగూర్ రంగంపేట మత్తడి బ్రిడ్జ్ గుంతలు పడి తెగిపోయిన ఇంతవరకు అధికారులు స్పందించలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డా.పెసరు విజయచందర్ రెడ్డి మండిపడ్డారు. సంగెం మండలం ఎలుగూర్ రంగంపేట మత్తడి బ్రిడ్జిని శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి పెసరు విజయచందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతకు ముందు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముమ్మిడివరం నుంచి ఎలుగూర్ రంగంపేట వరకు బ్రిడ్జి వేస్తానని ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదని విమర్శించారు. గుంతలు పడి సంవత్సరమైన ఇక్కడున్న సర్పంచ్ భర్త ఈ బ్రిడ్జికి సపోర్ట్ గా ఉన్నమట్టి గడ్డను అమ్ముకున్నట్లు తెలుస్తోందన్నారు. దీని ద్వారా ఇంకా ఈ బ్రిడ్జీ బలహీనమయ్యె పోయిందన్నారు. తొందరగా మరమ్మత్తులు పనులు మొదలు పెట్టకపోతే బీజేపీ ప్రజల తరఫున నిలబడి పెద్ద ఎత్తున ధర్నా నిరసన కార్యక్రమం చేపడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీనిపై త్వరలోనే కలెక్టర్ కు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుట్టి కుమార స్వామి, వరంగల్ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ చౌకీదార్, మండల ప్రధాన కార్యదర్శి భూక్యా వెంకన్న, యువ మోర్చా మండల అధ్యక్షుడు అవనిగంటి సతీష్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు హనుమకొండ యాకుబ్, సోషల్ మీడియా కన్వీనర్ కాగితాల సాయికుమార్, శక్తి ఇంచార్జులు పెండ్లి రమేష్, గోనే ముకుందం, బూత్ అధ్యక్షుడు లక్క శ్రీనివాస్, దామెర్ల సూరయ్య, మచ్చిక వీరాస్వామి, సింగిరెడ్డి చంద్రశేఖర్, దసరి నరేష్, కర్ధారి రాజు, బానోతు రాజు, బాబురావు పాల్గొన్నారు.

# రెగ్యులర్ చేసేంత వరకు పోరాటం ఆగదు

**వరంగల్ వాయిస్, మరిపెడ:** కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలు నిలపటానికి మా ప్రాణాలను ఎదురు వడ్డీ కష్టపడిన మాకు తెలంగాణ ప్రభుత్వం అరెస్టులతో బహుమానంగా ఇచ్చిందని మండలంలోని సెకండ్ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన 2 ఏఎన్ఎం లను మరిపెడ పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో సెకండ్ 2 ఏఎన్ఎంలు ఝాన్సీ, బోడ విజయ మాట్లాడుతూ సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేసే అంతవరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదని, అధికారులు పోలీసులు బెదిరించిన భయపడే ప్రసక్తే లేదన్నారు. అరెస్టు అయిన వారిలో బోడ విజయ, ఝాన్సీ, తులసి, శ్రీలత, రోజామణి, తదితరులు ఉన్నారు.

# వరద బాధితులకు సీపీఐ నాయకుల సాయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరద బాధితులకు సహాయాన్ని అందించేందుకు సీపీఐ నాయకులు తరలి వెళ్లారు. సీపీఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో సేకరించిన దుప్పట్లు, బట్టలు, బియ్యం తదితర వస్తువులను అందజేయుటకు శుక్రవారం హనుమకొండ నుంచి సీపీఐ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి బయలుదేరిన నిత్యావసర వస్తువులతో కూడిన వాహనాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల వల్ల ములుగు జిల్లా కొండాయి తదితర గ్రామాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామాలలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అక్కడి ప్రజలను ఆదుకునేందుకు తమ శాయశక్తులా బియ్యం, దుప్పట్లు, బట్టలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మునగాల భిక్షపతి, నకీర్త ఓదెలు, మాలోతు శంకర్, రాసమల్ల దీన, కుమార్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని మాందారిపేట గ్రామానికి చెందిన అల్లం రాజకొమురయ్య గురువారం రాత్రి దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కాగా, శుక్రవారం మాందారిపేటలో రాజకొమురయ్య అంతిమ యాత్రలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరం రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కానుగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కారుకూరి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి రాజమొగిలి, దొంగరి రవి, కొత్తపల్లి గోరి మండల ప్రధాన కార్యదర్శి బోడకుంట్ల అశోక్, అక్కల రమేష్, సూరం మొగిలి, చిరిపోతుల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు బియ్యం అందజేత




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కందుల సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, 11వ డివిజన్ రంగంపేటలోని ముంపు ప్రాంతంలో నిరాశ్రయులైన బాధితులకు 25కిలోల బియ్యం బస్తాలను అందించిన ఫౌండేషన్ సభ్యులు, కందుల సత్యనారాయణ ఫౌండేషన్ ఎల్లపుడు మీ వెంటే ఉంటుందని సంస్థ చైర్మన్ కందుల సృజన్ కాంత్ భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మొహ్మద్ అజీజ్ ఖాన్, అసిస్టెంట్ కమిషనర్ అఫ్ పోలీస్ బోనాల కిషన్, ఏజీపీ జన్ను ఆనంద్, సర్కిల్ ఇన్ స్పెక్టర్ అఫ్ పోలీస్ వెంకటేశ్వర్లు, సామాజిక వేత్తలు నిమ్మల శ్రీనివాస్, సాగంటి మంజుల, బార్ అసోసియేషన్ బాధ్యులు, కందుల సత్యనారాయణ, కుటుంబ సభ్యులు, పురప్రముఖులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# మల్హర్ నూతన తహసీల్దార్‌గా శ్రీనివాసులు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల నూతన తహసీల్దార్‌గా వై.శ్రీనివాసులు నియామకమయ్యారు. ఇప్పటి వరకు మల్హర్ తహసీల్దార్ గా విధులు నిర్వర్తించిన పి.శ్రీనివాస్ బదిలీ కాగా ఆయన స్థానంలో మంగపేట నుంచి బదిలీపై వచ్చిన వై. శ్రీనివాసులు మల్హర్ మండల తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టనున్నారు.

# మోరంచపల్లికి టీఎన్జీఓఎస్ ఆర్థిక సాయం

## కలెక్టర్‌కు చెక్కు అందజేత




**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన మోరంచపల్లి గ్రామానికి చేయూతనివ్వాలనే సంకల్పంతో టీఎన్జీఓఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఉద్యోగుల నుంచి విరాళాలు సేకరించారు. అలా సేకరించిన రూ. 4,03,696 చెక్కును జిల్లా అధ్యక్షుడు బూర్గు రవి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు శుక్రవారం కలెక్టరేట్ లో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ వంతుగా అందించిన ఈ సహకారాన్ని మోరంచపల్లి గ్రామంలో సర్వం ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు అందించే విధంగా చర్యలు తీసుకుంటానని, ఆర్థిక సహకారం అందించిన టీఎన్జీఓఎస్ ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బూరుగు రవిమాట్లాడుతూ హనుమకొండ, వరంగల్, కరీంనగర్, జనగాం, మహబూబాబాద్, ములుగు,పెద్దపల్లి, మెదక్, మంచిర్యాల, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి ఆర్థిక సహకారం అందించిన టీఎన్జీఓఎస్ బలగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రామకిషన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు శామ్యూల్, ములుగు జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ సింగ్, టీఎన్జీఓఎస్ భూపాలపల్లి జిల్లా కోశాధికారి దశరథ రామారావు, టీఎన్జీఓఎస్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు వంశీకృష్ణ, అలివేలు, అన్వర్, శ్రీదేవి, రమణ కుమార్, మనోజ్ వర్ధన్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, కోశాధికారి సదానందం, టీఎన్జీవో కేంద్ర సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి ఎర్రబెల్లిని కలిసిన బీఆర్ఎస్ నేతలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాదు ఎమ్మెల్యే క్వార్టర్స్ మంత్రి నివాసంలో తూర్పు బీఆర్ఎస్ నేతలు కర్నే రవీందర్ ఆధ్వర్యంలో మేర కులస్తులు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును శుక్రవారం కలిశారు. ఆర్థికంగా వెనుకబడిన మేర కులస్తులకు బీసీ లోన్లు అర్హులైన వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం, 42వ డివిజన్ లో మేర భవనం కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, టెక్స్ టైల్ పార్కులో మేర కులస్తులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి తప్పకుండా మేర కులస్తులకు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓడపల్లి సాగర్ మేరు, అడుప కరుణాకర్ మేరు, వంశీకృష్ణ మేరు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు ప్రజాప్రతినిధులు సహకరించాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** శాంతి భద్రతలను కాపాడడానికి పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రజాప్రతినిధులు, ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సీఐ నరేష్ అన్నారు. శుక్రవారం 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ కు నూతనంగా విచ్చేసిన సీఐ నరేష్ కు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా మాట్లాడారు. ప్రజలు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే న్యాయంగా ఉన్న వాటికి సాధ్యమైనంత వరకు పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు.

## తొలిమెట్టు శిక్షణ తరగతుల పరిశీలన



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు పర్వతగిరి ఉన్నత పాఠశాలలో నిర్వహించబడుతున్న తొలిమెట్టు శిక్షణ తరగతులను వరంగల్ జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎం.సారయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యతలను పెంపొందించుకోవడానికి విద్యార్థులకు సులభతరమైన రీతిలో బోధన చేయడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి మండల నోడల్ అధికారి గాయపు లింగారెడ్డి, పర్వతగిరి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్, ఎండీ జలీల్, రిసోర్స్ పర్సన్స్ శ్రీధర్, సుభాషిణి ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది నాగినేని శిల్ప, గారే జయరాజ్, సారయ్య పాల్గొన్నారు.

# శ్రీధర్ బాబు ప్రోద్భలంతోనే ఎంపీపీపై అవిశ్వాసం




**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఎంపీపీ బన్సోడ రాణిబాయిపై మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రోద్భలంతోనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినట్లు మహాదేవపూర్ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. మొదట కాంగ్రెస్ నాయకులు అవిశ్వాస తీర్మానంపై ఇచ్చిన నోటీసులో సంతకాలు చేసిన విషయాన్ని ఎంపీపీ మరిచి బీఆర్ఎస్ అధిష్టానంపై ఆరోపణలు చేయడం సరికాదని, వారు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆక్షేపించారు. ఎంపీపీపై అవిశ్వాసం పెట్టిన తరువాత ఎంపీపీ పార్టీ నాయకుల వద్దకు వెళ్లాలా లేదా పార్టీ నాయకులే తమ వద్దకు రావాలా అని సంశయించారు. బీఆర్ఎస్ పార్టీ పెద్దల వద్దకు వెళ్లకుండా కాంగ్రెస్ పార్టీ నాయకుల వద్దకు తిరగడం వారి నిజాయితీ ఏంటో అర్థం అయిందని తెలిపారు. తమ నాయకుడు పుట్ట మధుకర్ గత కొద్ది సంవత్సరాలుగా బహుజన వాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి వారి పట్ల ఆయనకున్న మమకారాన్ని ఆయా సందర్భాల్లో వ్యక్తం చేస్తున్నారని వారు గుర్తు చేశారు. అందులో భాగంగానే మహాదేవపూర్ మండలానికి సంబంధించి అతి తక్కువ జనాభా ఉన్న కటిక కులం నుంచి కాటారం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పదవిని అన్కరి భవానికి, ప్రస్తుత మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా మేరకులానికి చెందిన పెండ్యాల మమతకు ఇచ్చిన విషయాన్ని మరిచిపోరాదని వారు గుర్తు చేశారు. గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన ప్రస్తుత ఎంపీపీ రాణి బాయ్ కు వార్డు మెంబర్ స్థాయికి మించి పదవులు రాలేదని, మదన్న నాయకత్వంలో బీఆర్ఎస్ లోకి వచ్చిన స్వల్పకాలంలోనే ఆమెకు కీలకమైన ఎంపీపీ పదవిని కట్టబెట్టిన విషయాన్ని వారు మరిచిపోయారని మండిపడ్డారు. ప్రజలు గమనిస్తున్నారని, స్వలాభం కోసం, స్వార్థం కోసం ఆమెను గుర్తించి పదవిని కట్టబెట్టిన వారిపట్ల అసహనం వ్యక్తం చేస్తూ మాట్లాడడం ఆమె అవివేకానికి నిదర్శనమని అన్నారు. రాణి బాయ్ సామాజిక వర్గానికి బలమైన ఓటు బ్యాంకు లేనప్పటికీ, కీలకమైన ఎంపీపీ స్థానాన్ని కట్టబెట్టడం వెనుక బీసీ సామాజిక వర్గాన్ని గుర్తించడమేనని వారన్నారు. అవిశ్వాసం తర్వాత రాణి బాయ్ శ్రీపాదరావు విగ్రహానికి పూలమాలవేసి తన నిజ స్వరూపాన్ని చాటుకున్నారని వారు ఆరోపించారు. గొర్రె కసాయివాడినే నమ్మిన విధంగా బహుజనులకు ఎలాంటి ఉపకారం చేయని దుద్దిళ్ల కుటుంబం వైపు ఆమె అడుగులు వేసిందని దుయ్యబట్టారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు పన్నిన రాబోయే ఎన్నికల్లో బహుజనుల అండతో, మంథని ప్రజల ఆశీర్వాదంతో పుట్ట మదన్న భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మహాదేవపూర్ వైస్ ఎంపీపీ బండం పుష్పలత, మహాదేవపూర్ మూడో ఎంపీటీసీ చల్ల రమణ, కాళేశ్వరం ఎంపీటీసీ రేవెల్లి మమత, బెగులూర్ ఎంపీటీసీ చల్ల పద్మ, అంబట్ పల్లి ఎంపీటీసీ బీసుల జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక గర్జనకు పోకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికం




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై దశల ప్రచార ఆందోళన నిర్వహించి నేడు హైదరాబాద్ కు తరలి వెళ్తున్న ఐఎఫ్ టీయూ కార్మికులను పాలకుర్తిలో పోలీసులు అడ్డుకోవడం అ ప్రజాస్వామికమని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐ ఎఫ్ టీయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. నేడు తొర్రూరులోని బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అర్హులైన కార్మికులందరికీ డబల్ బెడ్ రూమ్ సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి హైదరాబాదుకు తరలి వెళుతున్న కార్మికులను పాలకుర్తి వద్ద నిలిపివేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలని కోరారు. గత 30 రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక నిరసనను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. బస్టాండ్ నుంచి కూరగాయల మార్కెట్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతా నవీన్, బానోతు బాలు, మంగళపెల్లి ప్రసాద్, అర్వపల్లి వెంకన్న, నరసింహ, సెగ్గం యాకయ్య, వెంకన్న, సంపత్, రాములు, వెంకన్న, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## బోనాల పండుగకు అన్ని ఏర్పాట్లు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** బోనాల పండుగను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం ముత్యాలమ్మ తల్లి బోనాల ఏర్పాట్లను, అన్నారం రోడ్డులోని గోల్కొండ ముత్యాలమ్మ బోనాల ఏర్పాట్లను మండల అభివృద్ధి కమిటీ చైర్మన్, ముత్యాలమ్మ తల్లి గుడి నిర్మాణ దాత పోనుగోటి సోమేశ్వరరావు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి,సీఐ సత్యనారాయణ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఆటంకాలు లేకుండా బోనాల పండుగను నిర్వహించాలని, శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ ముత్యాలమ్మ తల్లి దగ్గర భారీకేడింగ్, లైటింగ్, డీజే తదితర ఏర్పాట్లను మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రశాంత వాతావరణంలో బోనాల ఉత్సవాలు జరిగే విధంగా పోలీసు డిపార్ట్ మెంట్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ రంజిత్, మేనేజర్ కట్టా స్వామి, కౌన్సిలర్ బుసాని రాము, నాయకులు దొంగరి శంకర్, కర్నే నాగరాజు, బిజ్జల అనిల్, గుండాల నరసయ్య, కుర్ర శ్రీనివాస్, తూర్పాటి రవి, ఆశయ్య, రిటైర్ సీఐ రామస్వామి, ఎర్రోళ్ల ఎల్లయ్య, వీరయ్య, కవర్ల శీను, వార్డు ఆఫీసర్లు పట్టాభి,హెల్త్ అసిస్టెంట్ రాజు, శానిటరీ ఇనస్పెక్టర్ దేవేందర్, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదు



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం గ్రామపంచాయతీ కార్మికులు పెట్టిన డిమాండ్లను పరిష్కరించే వరకు కార్మికుల సమ్మెను కొనసాగిస్తూనే ఉంటామని సీఐటీయూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు ఆడప సంతోష్ అన్నారు. పలిమెల మండల కేంద్రంలో గల గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో ఆయన పాల్గొని నిరాశ పడకూడదని పోరాటాలను విస్తృతం చేస్తేనే ఫలితం దక్కుతుందన్నారు. ఎవరు కూడా గ్రామపంచాయతీ పనికి వెళ్లకూడదని, ప్రైవేట్ వ్యక్తులను పెట్టి పని చేయిస్తే ఊరుకునేది లేదన్నారు. సర్పంచులు, కార్యదర్శులు సహకరించాలని అన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పలిమేల మండల ఇంచార్జి జిముడ రాజబాబు, అధ్యక్షుడు నాగయ్య, కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ నాయకులు సతీష్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# రామచంద్రయ్య విప్లవ స్ఫూర్తిని కొనసాగించాలి

## న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోవర్ధన్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కోశాధికారిగా దేశెట్టి రామచంద్రయ్యకు విప్లవ జోహార్లు అర్పిస్తూ రెడ్యాల గ్రామంలో గుజ్జు దేవేందర్ అధ్యక్షతన సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవర్ధన్ మాట్లాడుతూ రామచంద్రయ్య 1980 నుంచి మహబూబాబాద్ ప్రాంతంలో పార్టీ కార్యకర్తగా పనిచేస్తూ ఆనాటి పార్టీ నాయకులు సురేష్ అన్న మాధవ్ అన్న ఇచ్చిన విప్లవ స్ఫూర్తిని అందుకొని వారి నాయకత్వంలో ఎంతో కమిట్ మెంట్ గా తుది శ్వాస విడిచే వరకు మహబూబాద్ జిల్లాలో పార్టీని బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ఆంతరంగిక సంక్షోభంలో కూడా పార్టీ వైపు దృఢంగా నిలబడ్డారన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కోశాధికారిగా ఎదిగి రైతు కూలీల సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించాడని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సాధనలో పార్టీ తరఫున జేఏసీలో లో కీలకంగా వ్యవహరించి తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాడని, అదేవిధంగా దళితులకు పోడు భూములు కొట్టించి వారికి వెన్నుదన్నుగా నిలిచాడని అన్నారు. నివాళులు అర్పించిన వారిలో వివిధ పార్టీల నాయకులు, న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకుడు ఆవునూరి మధు, ప్రజాపంథ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాయల చంద్రశేఖర్, ఇల్లందు మాజీ శాసనసభ్యుడు గుమ్మడి నరసయ్య, జడల వెంకన్న, చిన్న చంద్రన్న, పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఘనపురం అంజయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, జేఏసీ నాయకులు డోలి సత్యనారాయణ, డాక్టర్లు కల్వకుర్తి చంద్రశేఖర్, జగన్‌మోహన్‌రావు, చింత రమేష్, కుమారస్వామి, ఇంద్రసేనారెడ్డి, పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## వరదల బాధితులను వెంటనే ఆదుకోవాలి



**వరంగల్ వాయిస్, పరకాల :** రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా వివిధ గ్రామాల్లోని పెద్ద చెరువులు భారీగా గండ్లు పడి వరదల బీభత్సానికి తెగిపోయినందున రైతులు పంటలను నష్టపోవాల్సి వచ్చిందని పంటలు వేసుకోలేని పరిస్థితిలో రైతులు ఉన్నారని పంటలను నష్టపోయిన వారిని వెంటనే ఆదుకోవాలని, వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ పరకాల మండల అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొమ్మకంటి చంద్రమౌళి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధిక వర్షాలలో పంట పొలాల్లోకి వచ్చే పెద్ద చెరువుల ద్వారా అతి భారీ వర్షాల వల్ల గండ్లు ఏర్పడి తగినందున పంటలు వేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా రైతులు నష్టపోయిన కారణంగా ఎకరానికి రూ.50వేల నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ఏఎన్‌ఎంల ముందస్తు అరెస్ట్




**వరంగల్ వాయిస్, మల్హర్ :** గత 16 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలను వెంటనే జీఓ నంబర్ 16 ద్వారా రెగ్యులర్ చేయాలనే డిమాండ్ తో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన సెకండ్ ఏఎన్ఎం లను శుక్రవారం కొయ్యూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ తమ డిమాండ్లను, ఇబ్బందులను గతంలో నే మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుక వెళ్లామని కానీ, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ ఇవ్వక పోవడంతో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హెల్త్ అసిస్టెంట్లను రెగ్యులర్ చేసిన విధంగానే తమను కూడా రెగ్యులర్ చేయాలని సెకండ్ ఏఎన్‌ఎంలు స్వప్న, సరిత, ఉమ, సాధన, సవిత, సుజాత, భాగ్యలక్ష్మి కోరారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు




**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని మాందారిపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే పక్క సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఎస్సై డి దేవేందర్ తన సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ ఖలీల్, నాగరాజు డ్రైవర్ రాజేందర్ రెడ్డితో సంఘటన స్థలానికి వెళ్లారు. దీంతో వారు రూ.41260నగదు, రెండు ద్విచక్ర వాహనాలను, 4 సెల్ ఫోన్లు, పేక ముక్కలను స్వాధీన పరుచుకొని పేకాట ఆడుతున్న గుండె కారి శ్రీనివాస్, చందనాల సునీల్, బోట్ల సురేందర్, వలుపదాసు చంద్రమౌళి లను అదుపులోకి తీసుకోగా, నిమ్మల సురేష్ పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. వీరిని స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు .

# పోలీసులు అంకితభావంతో పనిచేయాలి

## ఎస్పీ శరత్ చంద్ర పవార్



**వరంగల్ వాయిస్, సీరోల్ :** మండలంలోని పోలీస్ స్టేషన్ ను ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి సంబంధించిన నీట్ టర్న్ ఔట్, కిట్ ఆర్టికల్స్ పరిశీలించారు. అక్కడి పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్సై ఎస్పీకి వివరించారు. పోలీస్ స్టేషన్ అవరణలో మొక్క నాటి, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు పోలీస్ స్టేషను పరిశుభ్రంగా ఉంచాలని, విధుల పట్ల అంకితభావంగా ఉండాలని, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని, ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. పోలీస్ స్టేషన్ లోని వర్టికల్స్ నిర్వహణ, హెచ్‌ఆర్‌ఎంఎస్ ఆన్ లైన్ వినియోగించు విధానం, టీఎస్ కాప్స్, సీసీటీఎన్ఎస్ ఆన్ లైన్ లో కేసుల వివరాలు నమోదు చేసే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి పిటిషన్ ను ఆన్ లైన్ లో నమోదు చేయాలని, సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతిరోజు వారిని తనిఖీ చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు పెండింగ్ లో ఉంచరాదని, వారితో మర్యాదగా మెలగాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, కలిగి ఉండాలని తెలిపారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రివార్డు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వర బాబు, మరిపెడ సీఐ ఎల్.రాజు, సీరోలు ఎస్.ఐ రమాదేవి, సీసీ చంద్రకాంత్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి

## ఎంపీ మాలోతు కవిత



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని మహబూబాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు, ఎంపీ మాలోతు కవిత అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి కాదని భారత రైతు సమితి అని మరో మారు రుజువైందని గుర్తు చేశారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ నినాదాంతో బీఆర్ఎస్ పార్టీగా మార్పు చెంది ప్రతి క్షణం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి పక్షాన నిలిచిందని గుర్తు చేశారు. రైతు రుణమాఫీ సందర్భంగా 19వేల కోట్ల రుణమాఫీ చేయడం ద్వారా 29.61లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. ఆర్టీసీని ప్రభుత్వం లో విలీనం చేయడం ద్వారా 43వేల మంది ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నారని తెలిపారు. వీఆర్ఏలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, వీఆర్ఏ వ్యవస్థను పూర్తిగా రద్దు చేస్తూ, వీఆర్ఏలుగా పని చేస్తున్న 20,555 మందికి ప్రభుత్వ ఉద్యోగాల కల్పన, మహబూబాబాద్ జిల్లాకు హార్టి కల్చర్ డిగ్రీ కళాశాల మంజూరు చేసిన సందర్భంగా కేసీఆర్ కు ఎంపీ కవిత ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారం జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేశారని, దాని వల్ల జిల్లా ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య, ఎందరో వైద్య విద్యార్థులకు మేలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసి, బంగారు తెలంగాణ నిర్మాణంలో ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్, ముత్యం వెంకన్న, జడ్పీ కోఆప్షన్ మహబూబ్ పాషా, నల్లని నవీన్ రావు, బోడ లక్ష్మణ్, కురవి మాజీ ఎంపీపీ పెద్ది వెంకన్న, అసిఫ్ అలీ, మనాది, రాజేష్, బానోతు రాము, గుర్రాల సురేష్ పాల్గొన్నారు.

## మల్లంపల్లిలో గుప్త నిధుల కోసం తవ్వకాలు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని మల్లంపల్లి గ్రామ సమీపంలోని రాజుల గుట్ట వద్ద కొందరు వ్యక్తులు గురువారం రాత్రి గుప్త నిధుల కోసం జేసీబీలతో తవ్వకాలు జరిపినట్టు ఆనవాలు దొరికాయి. గుట్ట సమీపంలో పూజలు చేసి, జేసీబీతో భారీ గుంతలు తవ్విన కొందరు వ్యక్తులకు భారీగా నిధులు దొరికినట్టు గ్రామంలో పలువురు చర్చించుకుంటున్నారు. గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగడం గ్రామంలో ఇది కొత్తేమీ కాదని, గతంలో కూడా చాలా సార్లు పలువురు వ్యక్తులు తవ్వకాలు జరిపారని, ఈ విషయం పై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## హసన్‌పర్తి తహసీల్దార్‌గా చల్ల ప్రసాద్



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హసన్‌పర్తి తహశీల్దార్‌గా బండి నాగేశ్వరరావు బదిలీపై వెళ్లగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హసన్ పర్తి తహసీల్దారుగా చల్ల ప్రసాద్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం హసన్ పర్తి తహసీల్దార్ గా చల్ల ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. మండల కార్యాలయ సిబ్బంది ఎమ్మార్వో చల్లాప్రసాద్ కు పూల బొకే అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ ప్రణయ్ డీటీ రహీం పాషా, సీనియర్ అసిస్టెంట్ రాణి, కుమారస్వామి, ఎర్రప్రగడ సారంగపాణి, శ్రీను, బండ్లశ్రీను, లోకనాథం, రాజు, దివ్య, సాంబరాజు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
శుక్రవారం 04, ఆగస్టు 2023






# ప్రతిష్ఠాత్మకంగా ..

## బాలకృష్ణ, కాజల్, శ్రీలీలలపై పాట చిత్రీకరణ

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'భగవంత్ కేసరి' ప్రతిష్టాత్మకంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. బాలకృష్ణను డిఫరెంట్‌గా చూపబోతున్నారు. సాహు గారపాటి, హరీష్ పెద్ది ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది విడుదలైయ్యే భారీ అంచనాల సినిమాలలో ఒకటి. ప్రస్తుతం 'భగవంత్ కేసరి' షూటింగ్ హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సిలో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. బాలకృష్ణ, కాజల్ అగర్వాల్, శ్రీలీల ప్రధాన తారాగణంపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ప్రధాన తారాగణం అంతా కనిపించ బోయే ఈ పాటను బిగ్ స్క్రీన్స్‌పై చూడటం కన్నుల పండువగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. 'భగవంత్ కేసరి' యునిక్ కాన్సెప్ట్‌తో హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుంది. బాలకృష్ణను మునుపెన్నడూ చూడని క్యారెక్టర్‌లో అనిల్ రావిపూడి ప్రజంట్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ రాబట్టుకున్న విషయం తెలిసిందే. బాలకృష్ణ పవర్ ఫుల్ ప్రజన్స్, తెలంగాణ యాసలో డైలాగ్‌లని చెప్పడం ఎంతగానో అలరించింది. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీలీల కీలక పాత్రలో కనిపించనుంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ ఈ సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆయన విలన్‌గా కనిపించనున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 19న 'భగవంత్ కేసరి'ని విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

## పట్టాలకెక్కించే పనిలో పవన్

షూటింగ్‌కు ప్లాన్ చేస్తున్న డైరెక్టర్ హరీష్ శంకర్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఉత్సాద భగత్ సింగ్‌ను పట్టాలకు ఎక్కించే పనిలో పవన్ కల్యాణ్ ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇటీవలే సముద్రఖని దర్శకత్వంలో బ్రో సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చి.. బాక్సాఫీస్ వద్ద రికార్డులు క్రియేట్ చేస్తున్నాడు. బ్రో నిర్మాతలకు కాసుల పంట పండిస్తూ.. టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగ్రా నిలుస్తోంది. బ్రో సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న పవర్ స్టార్ అభిమానుల కోసం అదిరిపోయే అప్‌డేట్ ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రాల్లో ఒకటి ఉస్తాద్ భగత్ సింగ్. హరీష్ శంకర్ దర్శకత్వంలో లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ పవన్ కల్యాణ్ మ్యానరిజాన్ని ఎలివేట్ చేసేలా సాగుతూ విజువల్ ట్రీట్ అందిస్తోంది. తాజాగా ఉస్తాద్ భగత్ సింగ్ షూటింగ్ అప్‌డేట్ వచ్చింది. లేటెస్ట్ సమాచారం ప్రకారం మిడ్ ఆగస్టులో ఈ మూవీ నెక్ట్స్ షెడ్యూల్ షురూ కానుంది. పవన్ కల్యాణ్ నుంచి రాబోతున్న పర్‌ఫెక్ట్ కమర్షియల్ సినిమా లోడింగ్.. అంటూ తాజా అప్‌డేట్ ఇప్పుడు నెట్టింట్లో ట్రెండింగ్ అవుతోంది. ఉస్తాద్ భగత్ సింగ్ గ్లింప్స్ నెట్టింట ట్రెండింగ్ అవుతూ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది.

భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్‌స్టేషన్, పత్తర్ గంజ్, ఓల్డ్ సిటీ. ఈ సారి పర్ ఫార్మన్స్ బద్దలైపోద్ది.. అంటూ తనదైన మ్యానరిజంతో సాగుతున్న పవన్ కల్యాణ్ డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతూ.. సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి.





## వచ్చే వారమే..

మరో వారం రోజుల్లో జైలర్ సినిమాతో థియేటర్‌లు దద్దరిల్లిపోతుంటాయి. ఏ థియేటర్‌లో చూసిన సూపర్ స్టార్ స్లోగానే మొగుతుంది. మొన్నటి వరకు పెద్దగా అంచనాల్లేని ఈ సినిమాపై కావాలయ్యా పాట సహా ఆడియో లాంచ్‌లో రజనీ స్పీచ్ జైలర్ మూవీపై మాములు హైప్ తీసుకురాలేదు. పదేళ్లకు పైగా సరైన హిట్టులేని రజనీకు జైలర్ మంచి కంబ్యాక్ అవుతుందని అభిమానులు ధీమాగా ఉన్నారు. నెల్సన్‌కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్టు 10న పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ కాబోతుంది. ఈ క్రమంలో మేకర్స్ బ్యాక్ టు బ్యాక్ అప్‌డేట్‌లతో సినిమాపై మంచి హైప్ తీసుకొస్తున్నారు. తాజాగా చిత్రయూనిట్ ఈ సినిమాపై క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించింది. రికార్డ్స్ అందర్ సూపర్ స్టార్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాడు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ ముఖ్య పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, రమ్యకృష్ణ, సునీల్, ప్రియాంక అరుళ్‌మోహన్ వంటి స్టార్ కాస్ట్ ఈ సినిమాలో నటిస్తుంది.

# జీపీ కార్మికుల సమ్మెకు నెల రోజులు



**'ప్రగతి' కారకులం.. 'పస్తు'లుంటున్నాం..!**
**మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి**
**కార్మికులకు ఆరోగ్య, ఆర్థిక భద్రత కల్పించండి..**

**వరంగల్ వాయిస్, నడికూడ :** గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మె నెల రోజులకు చేరుకుంది. తమ నిసనను వివిధ రూపాల్లో తెలియజేస్తున్నారు. ఎండనక, వాననక ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి విన్నవించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## రాష్ట్ర వ్యాప్త సమ్మె..

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో సుమారు 50వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో పారిశుధ్య కార్మికులు, స్వీపర్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లు తదితర కేటగిరీలకు చెందిన వారు నర్సరీలు, వైకుంఠధామాలు, పార్కులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. గత 30 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులుగా పనులు చేస్తున్నప్పటికీ వారిని పర్మినెంట్ చేయడంతోపాటు పనికి గుర్తింపు, పని భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా లాంటి సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి వారికి అమలు కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 51 తీసుకొచ్చినా మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టి గొడ్డు చాకిరీ చేయించారు. పట్టిన కారోబార్, బిల్ కలెక్టర్ల ఆత్మగౌరాన్ని దెబ్బతీసేలా ఏ పనైనా చేయాలంటూ బలవంతంగా బాండ్ పేపర్ లపై సంతకాలు చేయించుకున్నారు. సిబ్బందితో నైపుణ్యం లేని పనులు చేయించడంతో అనేక ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో కడుపు మండిన గ్రామపంచాయతీ సిబ్బంది తమను పర్మినెంట్ చేయాలంటూ గత నెల రోజులుగా ఆందోళన బాట పట్టారు. మినిమం బేసిక్ ను రూ.19వేలు వేతనంగా చెల్లించాలని, జీవో నెంబర్ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లకు రూ. 19,500 చెల్లించాలని, సీనియారిటీని పరిగణలోకి తీపసుకొని కారోబార్లను, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, జీవో నెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పాతవిధానాన్ని కొనసాగించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, బీమా పథకాన్ని ఐదు లక్షలకు పెంచాలని, ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు చేయాలని, వారాంతపు సెలవులు అమలు చేయాలని, సంవత్సరానికి నగదు రూపంలో అలవెన్స్ ఇవ్వాలని, కార్మికులపై వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నారు.

## మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి..

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి 2018కి పూర్వం ఉన్న పాత విధానాన్ని అమలు చేయాలని గ్రామ పంచాయతీ సిబ్బంది డిమాండ్ చేస్తోంది. ముల్టీపర్పస్ విధానంతో నైపుణ్యం లేని వ్యక్తుల చేత ఎలక్ట్రీషన్, డ్రైవింగ్ లాంటి పనులు చేపట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నానే. కారోబార్లు, బిల్ కలెక్టర్లు రాతకు సంబంధించిన పనుల చెప్పాలని, కారోబార్లకు సైడ్ కాలువలు, చెత్త తీయడం లాంటి విధులను కేటాయించరాదని, కరోనా సమయంలో ప్రాణాల అడ్డుపెట్టి గ్రామాల్లో పరిశుభ్రత కోసం కృషి చేశామని గ్రామపంచాయతీకి, ప్రజలకు వారదులుగా ఉండి గ్రామాల ప్రగతికి తోడ్పడ్డామని మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.








## గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం..



**పర్వ భాస్కర్, కారోబార్ల సంఘం మండల అధ్యక్షుడు**

పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాలలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు కాలువలు తీయకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కొట్టుకు వచ్చిన వ్యర్థాలన్నీ అలాగే పేరుకుపోయాయి. పలు గ్రామాల సర్పంచులు అత్యవసర నిమిత్తం దినసరి కూలీలతో పనులు చేయిస్తున్నారు. అసలే నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామపంచాయతీలకు దినసరి కూలీల ఖర్చు భారంగా మారుతోంది.

## కనీస వేతనం అమలు చేయాలి..



**వంగ రవీందర్, కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి**

గ్రామపంచాయతీ సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలి. పనిని బట్టి స్వీపర్లకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ. 19,500 చెల్లించాలి. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం అందించాలి. ప్రమాద బీమా పథకాన్ని ఐదు లక్షలకు పెంచాలి.

## నైపుణ్యం లేక ప్రమాదాలు..



**మేకల ప్రశాంత్, సఫాయి కార్మికుడు కౌకొండ**

పని నైపుణ్యం లేని సఫాయి కార్మికులకు డ్రైవింగ్, ఎలక్ట్రీషన్ పనులు చెప్తున్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కాబట్టి పని విభజన జరిగి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి. ముఖ్యంగా మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలి. చాలా సంవత్సరాల నుంచి పని చేస్తున్న కార్మికులకు సంవత్సరానికి మూడు జతలు బట్టలు, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు తదితరాల అవసరాలకు నగదు రూపంలో అలవెన్స్ చెల్లించాలి.

# రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్షపై స్టే

## సంబురాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సూరత్ కోర్టు రాహుల్ గాంధీకి మార్చి 23న విధించిన రెండు సంవత్సరాల జైలు శిక్ష పై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో జిల్లా కేంద్రంలోని ఏఐసీసీ ఆదివాసీ వైస్ చైర్మన్, తెలంగాణ ఆదివాసీ చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, మహబూబాబాద్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు జె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీజేపీ సర్కార్ రాహుల్ గాంధీపై కుట్రపూరితంగా కేసు పెట్టి మోడీ అవమానించారని, కావాలని సూరత్ కోర్టులో శిక్ష విధించడంతో మార్చి 24న పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేస్తూ, అధికారిక నివాసాన్ని కూడా ఖాళీ చేయించారన్నారు. దీంతో రాహుల్ గాంధీ సుప్రీంకోర్టుని ఆశ్రయించగా సుప్రీంకోర్టు సూరత్ కోర్టు వేసిన శిక్షపై స్టే ఇస్తూ శుక్రవారం తీర్పు రావడంతో ఆనందోత్సాహాల్లో మునిగితేలారు. మోడీ సర్కార్, బీజేపీ పార్టీ ,ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని, రాహుల్ గాంధీ ప్రధాని కావడం తథ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్న సీతారాములు, ఐ ఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు వెన్నమల్ల వెంకటస్వామి, మహబూబాబాద్ పట్టణ ఎస్టీ సెల్ అధ్యక్షుడు తేజావత్ శంకర్ నాయక్, మహబూబాబాద్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధరావత్ నారాయణ, మహబూబాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకుడు గుగులోతు నరేష్, కిసాన్ సెల్ నాయకులు కొత్త యుగంధర్ రెడ్డి, మేకల శివ యాదవ్, ఎస్ కే యాకూబ్ పాషా, వ్యాసాల లింగయ్య, గుగులోతు శీను, మంద ఉప్పలయ్య, చారి పాల్గొన్నారు.

# సీఐపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

## కార్యకర్తలపై దాడిని సీరియస్‌గా తీసుకున్న రాకేష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీజేపీ కార్యకర్తలు ఏషబోయిన పురుషోత్తం, ఆలకుంట అనిల్ లపై ఇంతెజార్ గంజ్ ఇన్ స్పెక్టర్ ముస్కె శ్రీనివాస్ దాడి చేయడాన్ని ఆ పార్టీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి సీరియస్ గా తీసుకున్నారు. గత నెల 29 న పోతన నగర్ లో బీజేపీ కార్యకర్తల ఇన్ స్పెక్టర్ చేయి చేసుకోవడంతోపాటు దుర్భాషలాడిన విషయం విధితమే. ఈ మేరకు శుక్రవారం కార్యకర్తలను వెంటబెట్టుకొని హైదరాబాద్ కు చేరుకున్న రాకేష్ రెడ్డి రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కు పిర్యాదు చేశారు. సీఐ దాడికి సంబంధించిన సాక్ష్యాదారాలతో ఆయనకు సమర్పించారు. ఇన్ స్పెక్టర్ పై బీసీ కమిషన్ తో పాటు ప్రైవేట్ కేసు కూడా వేస్తామని ప్రకటించారు. ఆయన సస్పెండ్ అయ్యేదాకా వదిలే ప్రసక్తే లేదన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com